సాక్షి
అనంతపురం

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.16 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/ 22.7°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

మార్కెట్లకు లక్ష్మీకళ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పాతూరు మార్కెట్





గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ముత్తైదువులు దీర్ఘసుమంగళితనం కోసం భర్తతో కలిసి ఆచరించే పవిత్ర వరమహాలక్ష్మీ వ్రతమాచరించే రోజు రానే వచ్చేసింది. సంతానలక్ష్మి, ధనలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి.. ఇలా సంపద స్వరూపాలైన అమ్మవారిని భక్తితో ఆరాధించడానికి మగువలు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు పూజల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆభరణాలు, పూలు, పూజాసామగ్రి కొనుగోలుదారులతో గురువారం జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. రాప్తాడు మండలం బొమ్మేపర్తి ఆశ్రమంలో శుక్రవారం అవధూత స్వరూపులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామి పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరగనున్నాయి.

– అనంతపురం కల్చరల్:

న్యూస్‌రీల్

కాచిగూడ- కొల్లం మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: ఓనం పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాచిగూడ–కొల్లం మధ్య ఈ నెల 28 నుంచి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 సాయంత్రం 5:30 గంటలకు కాచిగూడ జంక్షన్ (07044)లో బయలుదేరి మరుసటి రోజు మంగళవారం రాత్రి 11.20 గంటలకు రైలు కొల్లం చేరుతుందన్నారు. తిరిగి 30న బుధవారం సాయంత్రం 7 గంటలకు కొల్లం జంక్షన్ (07045) నుంచి బయలుదేరి శుక్రవారం రాత్రి 12:30కు కాచిగూడ జంక్షన్ చేరుకుంటుందన్నారు. వికారాబాద్, రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప,రేణిగుంట, కాట్పాడి, కొట్టాయం మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందని తెలిపారు. ఫస్ట్ క్లాస్, టూ టైర్, త్రీ టైర్, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ



అనంతపురం: ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్, హౌస్ వైరింగ్‌పై రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి తెలిపారు. సెప్టెంబర్ 11 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 19 నుంచి 35 సంవత్సరాల వయసు మధ్య ఉన్న నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండి కనీసం పదో తరగతి చదివిన వారు (పాస్/ఫెయిల్) అర్హులన్నారు. 96188 76060, 08554–255925, 9440905479 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు



రాప్తాడురూరల్: ఆంగ్ల మాధ్యమిక ఉపాధ్యాయ పురస్కారాలు–2023 కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగనాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఆంగ్ల మాధ్యమ టీచర్లు ఆన్‌లైన్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 29న సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం రోజున పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇంగ్లిష్ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



పోతురాజుకాల్వలో పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

శింగనమల : పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం పోతురాజు కాల్వలో పత్తి పంట, శింగనమలలో వేరుశనగ పంట నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది సాగు చేసిన పొలం వద్దకు వెళ్లి పంట నమోదు చేయాలన్నారు. పంట నష్టపరిహారం, పంటల బీమా వంటివి రైతులకు అందుతాయన్నారు. అనంతరం ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్‌పీసీఐ వెబ్ ల్యాండ్ లింకేజీ, ఎన్‌పీసీఐ ఇనాక్టివ్ ఆధార్ ఉన్న రైతులకు పోస్టల్ బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేయించాలని సూచించారు. ఎరువుల లభ్యత, అమ్మకాలు సక్రమంగా జరగాలని ఆదేశించారు. ఏఓ అన్వేష్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది ఉమాదేవి, అమరేష్, రాజారెడ్డి, ఆదినారాయణ, జయలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ద్వైవార్షిక మంజూరు కింద 9,300 మందికి లబ్ధి
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.82 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ గౌతమి
- ప్రజాప్రతినిధులతో కలిసి మెగాచెక్ విడుదల



మెగా చెక్ విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, ప్రజాప్రతినిధులు

అనంతపురం అర్బన్: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఎమ్. గౌతమి అన్నారు. ఏ కారణం చేతనైనా పథకాలు అందని వారికి ద్వైవార్షిక మంజూరు కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. తాడేపల్లి క్యాంపు నుంచి సీఎం గురువారం కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, ఆర్డీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పాల్గొన్నారు. మెగాచెక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ జిల్లాలో అర్హులైన 9,300 మందికి రూ.10.82 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న వసతి దీవెన పథకం కింద 1,513 మందికి రూ.1.34 కోట్లు, జగనన్న విద్యాదీవెన పథకం కింద 1,820 మందికి రూ.2.27 కోట్లు, అమ్మఒడి కింద 838 మంది లబ్ధిదారులకు రూ.1.08 కోట్లు, జగనన్న చేదోడు- 2,235 మందికి రూ.2.23 కోట్లు, ఈబీసీ నేస్తం–397 మందికి రూ. 59.55 లక్షలు, వైఎస్సార్ ఆసరా- 120 మంది రూ. 24.79 లక్షలు, వైఎస్సార్ నేతన్న నేస్తం- 17 మందికి రూ. 4.08 లక్షలు, వ్యవసాయ శాఖ పరిధిలోని వివిధ పథకాల ద్వారా 2,360 మందికి రూ.2.99 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. 10,023 మందికి బియ్యం కార్డులు మంజూరైనట్లు పేర్కొన్నారు. పింఛను పథకం, ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హులైన వారికి లబ్ధి కలిగిందన్నారు. ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అన్నాదొర, జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితబాయి, ఇతర అధికారులు, విద్యార్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అవకాశం



మాది వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం రామాపురం గ్రామం. నాన్న చనిపోయారు. అమ్మ కూలీ పనులు చేస్తూ నన్ను చదివిస్తోంది. నాకు జగనన్న విద్యాదీవెన ద్వారా లబ్ధి చేకూరింది. ప్రభుత్వ ఆర్థిక సాయం ద్వారా పేద విద్యార్థులు ఉన్నతంగా చదవాలనే కోరిక నెరవేరుతోంది.

– నరసింహారెడ్డి, ఫార్మా డి విద్యార్థి, జేఎన్‌టీయూ కళాశాల, అనంతపురం

నాన్నకు ఆర్థిక భారం తగ్గింది



మాది కర్నూలు జిల్లా కోడుమూరు గ్రామం. నాన్న రైస్‌మిల్‌లో పని చేస్తూ నన్ను చదివిస్తున్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా లబ్ధి చేకూరడంతో నాన్నకు ఆర్థిక భారం తగ్గింది. అర్హత ఉండీ లబ్ధి కలగకపోవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకున్నా. ద్వైవార్షిక నగదు మంజూరు కింద లబ్ధి చేకూరింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– వికాస్, ఫార్మా డి విద్యార్థి, జేఎన్‌టీయూ కళాశాల, అనంతపురం

రీ సర్వే వేగవంతం చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద చేపట్టిన రీ–సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై గురువారం విజయవాడ నుంచి సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు ఇచ్చారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ శ్రీనివాసులు, సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటి దశలో 43 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందన్నారు. రెండో దశలో 57 గ్రామాల్లో చేపట్టారని, ఇందులో 15 గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి చేశారన్నారు. మిగిలిన ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

29న బాస్కెట్‌బాల్, కబడ్డీ పోటీలు

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్–16 బాస్కెట్ బాల్, కబడ్డీ (బాలురు, బాలికలు) పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పి. నరసింహా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. బాస్కెట్‌బాల్ కోచ్: 8500077011, కబడ్డీ కోచ్: 9885306643 నంబర్లకు ఈ నెల 27 లోపు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు.

ఓటరు ఉండీ తొలగిస్తే తిరిగి నమోదు

- కలెక్టర్ గౌతమి వెల్లడి
- ఓటరు జాబితా సవరణ–ఇంటింటి రీసర్వే పూర్తి



అనంతపురం అర్బన్: ఓటరు ఉన్నా తొలగించి ఉంటే మళ్లీ నమోదు చేస్తారని కలెక్టర్ గౌతమి తెలిపారు. అందుకు ఫా–6 అందించాల్సి ఉంటుందని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే జిల్లాలో పూర్తయ్యిందని ఆమె స్పష్టం చేశారు. ఓటరు తొలగింపులపై పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను గురువారం ఆమె వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గత ఏడాది జనవరి 6 నుంచి ఈ నెల 9 వరకూ జిల్లా వ్యాప్తంగా తొలగించిన 96,153 ఓట్లపై పునఃపరిశీలన చేస్తామని తెలిపారు. బూత్ లెవల్ అధికారి ప్రతి తొలగింపును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఈఆర్‌ఓలు నియోజకవర్గ పరిధిలో జరిగిన తొలగింపుల్లో వెయ్యి తొలగింపులను పరిశీలిస్తారన్నారు. ప్రత్యేక అధికారులు తమ నియోజకవర్గాల్లో 500 తొలగింపులను, తాను స్వయంగా ప్రతి నియోజకవర్గంలో 100 తొలగింపులు తగ్గకుండా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. జాబితా నుంచి పొరపాటున పేరు తొలగించి ఉంటే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ) ఫారం–6 ద్వారా పేరు నమోదు చేస్తారని వివరించారు.

అభ్యంతరాల పరిశీలన ఇలా..

ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు తెలిపినట్లయితే ఈఆర్‌ఓ వ్యక్తిగతంగా పరిశీస్తారని కలెక్టర్ తెలిపారు. ఈఆర్‌ఓ నియమించిన ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓ, ఉప తహసీల్దారు హోదా కలిగిన ముగ్గురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని పేర్కొన్నారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు క్షేత్రస్థాయి పరిశీలన షెడ్యూల్ తెలియజేస్తారన్నారు. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈఆర్‌ఓ వ్యక్తిగత విచారణ చేస్తారని, వాస్తవమని తెలితే ఓటరు జాబితా నుంచి తొలగిస్తారని వివరించారు. అభ్యంతరం తప్పు అని తేలితే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 31 కింద వారిపై కేసు నమోదు చేస్తారని స్పష్టం చేశారు. వారికి ఒక ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా లేక రెండు విధిస్తారని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు ఒకే సమయంలో లేదా ఒక రోజులో బూత్ లెవల్ అధికారి 10 దరఖాస్తులను ఫైల్ చేయవచ్చని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసే మొత్తం వ్యవధిలో బూత్ లెవల్ ఏజెంట్లు 30 కంటే ఎక్కువ దరఖాస్తులు ఫైల్ చేస్తే... వాటిని ఈఆర్‌ఓ లేదా ఏఈఆర్‌ఓ తప్పనిసరిగా పరిశీస్తారని వెల్లడించారు.

కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్స

అనంతపురం క్రైం: కేన్సర్ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ కేన్సర్ ఆస్పత్రుల నిర్వాహకులతో గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. కేన్సర్ ఆస్పత్రుల పరిధిలో సర్వీస్ పాయింట్లు ఏర్పాటు చేసి పీహెచ్‌సీలోని వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు అంకాలజిస్టుల ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. సర్వీస్ పాయింట్లలో నెలలో మూడుసార్లు క్యాంపులు నిర్వహించి, కేన్సర్ రోగులను గుర్తించి ఆరోగ్య శ్రీ అనుసంధానమైన ఆస్పత్రుల ద్వారా చికిత్సనందిస్తామన్నారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అంకాలజిస్టులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు నివారించాలి


మాతృ మరణాలు నివారించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన డాక్టర్ కుముద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

గార్లదిన్నె: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జ్ జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పైలా నరసింహయ్యకే పగ్గాలు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నియామకం
- అన్ని వర్గాలకూ సముచిత న్యాయం



అనంతపురం క్రైం: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలకు ఉపక్రమించింది. అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా కమిటీని గురువారం ప్రకటించింది. కమిటీలో బీసీలకు పెద్దపీట వేశారు. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన పైలా నరసింహయ్య (తాడిపత్రి)కే మళ్లీ అవకాశం కల్పించారు. ఉపాధ్యక్షులుగా రాళ్ల తిమ్మారెడ్డి (రాయదుర్గం), రాగే పరశురాం (అనంతపురం అర్బన్), చిట్రా వెంకటేష్ (రాప్తాడు), ప్రధాన కార్యదర్శులుగా కె.మాధవరెడ్డి (రాయదుర్గం), గూడూరు సూర్యనారాయణ రెడ్డి (తాడిపత్రి), బిక్కి నాగలక్ష్మి (కళ్యాణదుర్గం) నియమితులయ్యారు. కోశాధికారిగా ముద్ శ్రీనివాసులు నాయక్ (శింగనమల), కార్యదర్శులుగా భీమనపల్లి వైజాక్ రిబ్కా (రాయదుర్గం), బి.తేజోనాథ్ (ఉరవకొండ), యం.నాగేంద్ర (గుంతకల్లు), మొలగవేలి నాగ శేషానందరెడ్డి (తాడిపత్రి), కుమ్మెత చెన్నకేశవులు (శింగనమల), పి.గోపాల్ మోహన్ (అనంతపురం అర్బన్), వెంకటేష్ (రాప్తాడు), హెచ్.ఆంజనేయులు (కళ్యాణదుర్గం), గోగుల రాధాకృష్ణ (అనంతపురం అర్బన్), షేక్ రహంతుల్లా (అనంతపురం అర్బన్)ను నియమించారు. అలాగే, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన బోతుల బాగన్న, కె.గంగాధర, పల్లెడ కరిబసప్ప, కురుబ బసవరాజు, వి.సిద్ధమ్మ, హరిజన శ్రీదేవి, ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన భరత్ రెడ్డి, వెంకటరత్నమ్మ, ఎస్.తిప్పయ్య, జె.సంధ్య, గుంత కల్లు నియోజకవర్గానికి చెందిన జి.నిర్మలదేవి, ఆర్ఎస్ బాబురావు, బోయ రామచంద్ర, జి.గంగరాజు, తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన కోన వెంకటశివారెడ్డి, కుక్కల సూర్యనారాయణ, పులిరాజు, శింగనమల నియోజకవర్గానికి చెందిన సుబ్బిరెడ్డిగారి కృష్ణవేణి, జూటూరు నారాయణ, మొలకట్ల సుధాకర్‌రెడ్డి, అనంతపురం నియోజక వర్గానికి చెందిన యం.వేణుగోపాల్, పి. పురుషోత్తం, బి.శోభారాణి, రాప్తాడు నియోజకవర్గానికి చెందిన హనుమంత నాయక్, నాగరాజు, ఉప్పర రామగోపాల్, కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన కె.గోపాల్, బొమ్మలింగప్ప, నీలి శంకరప్ప, యం.జోసఫ్ కిశోర్, పి.గురు రాజ్‌లకు వైఎస్సార్ సీపీ అధిష్టానం అవకాశం కల్పించింది.

క్లుప్తంగా

ఐసీడీఎస్‌లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం

అనంతపురం సెంట్రల్: జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖలో ఖాళీగా పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో పోస్టులను భర్తీ చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి గురువారం తెలిపారు. జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా రాఘవేంద్ర, ప్రాజెక్టు అసిస్టెంట్‌గా షహీనా షమీన్, ఐసీపీఎస్ సోషల్ వర్కర్‌గా వెంకటకుమార్‌ను జిల్లా సెలక్షన్ కమిటీ ఉత్తర్వుల మేరకు నియమించినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం చెర్లోపల్లిలో విద్యుత్ షాక్‌కు గురై ఓ యువరైతు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మల్లికేతిలో నివాసముంటున్న రవీనా (25) చెర్లోపల్లిలోని తన సొంత పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మిర్చి పంటకు నీరు పెట్టేందుకు గురువారం వేకువజాము 3 గంటలకు పొలానికి చేరుకున్న ఆయన.. 5 గంటలకు తన తల్లి ఉలేమ్మకు ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం పొలం ఉపరితలంలో నీటి తడి పూర్తవడంతో కిందకు వదిలేందుకు బోరు వద్ద అమర్చిన బెండు పైపును తిప్పే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

మాట నిలబెట్టుకున్న జగనన్న

- పెన్నానదిపై శరవేగంగా కాజ్‌వే నిర్మాణ పనులు
- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


చిట్టూరు వద్ద కాజ్‌వే పనులు పరిశీలిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: ప్రజాసంకల్ప పాదయాత్రలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాటను అధికారంలోకి రాగానే నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కొనియాడారు. చిట్టూరు గ్రామం వద్ద పెన్నానదిపై చేపట్టిన కాజ్‌వే పనులను గురువారం వారు పరిశీలించి, మాట్లాడారు. నాడు చిట్టూరు మీదుగా తరిమెలకు పాదయాత్రగా చేరుకున్న వైఎస్ జగన్.. స్థానికులతో సమస్యలపై ఆరా తీశారన్నారు. ఆ సమయంలో రెండు గ్రామాల మధ్య పెన్నానదిలో రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొనడంతో తాను అధికారంలోకి రాగానే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారన్నారు.ఈ నిర్మాణం పూర్తయితే చిట్టూరు , నాగలాపురం, చిత్రచేడు, గోపురాజుపల్లి, రాంపురం తదితర గ్రామాల ప్రజలు అత్యవసర సమయంలో అనంతపురం వెళ్లడానికి మార్గం సులువవుతుందన్నారు. పనులు వేగవంతం చేయాలని పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఈఈ కొండయ్య, డీఈ రజనీకాంత్‌రెడ్డి, ఏఈ సురేష్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, మండల యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామియాదవ్, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి .రామచంద్రారెడ్డి, చిట్టూరు భాస్కర్‌రెడ్డి, నాగభూషణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, కొండూరు అమర్‌నాథ్‌రెడ్డి, శేషారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, తరిమెల గోకుల్‌నాథరెడ్డి, కాంట్రాక్టర్ శివారెడ్డి, తాడిపత్రి కందిగోపుల మురళీధర్‌రెడ్డి, కొండూరు దేవమోహన్‌రెడ్డి, చిన్నవడుగూరు సర్పంచ్ రమణారెడ్డి, కాశేపల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి, డీలర్ మోహన్‌యాదవ్, చిత్రచేడు నాగేంద్ర, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రారాజు సీఎం జగనన్న

- గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


మలయనూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కుందుర్పి: రాష్ట్ర వ్యాప్తంగా లెక్కకు మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ రారాజుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కొనియాడారు. కుందుర్పి మండలం అప్పిలేపల్లి, కుందుర్పి, మలయనూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఆమె ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్ సచివాలయాల వ్యవస్థ ద్వారా సిద్ధించిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఓటు బ్యాంక్ కోసమే అభివృద్ధిని మరచి పాలన సాగిందన్నారు. ఇందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకుడు జగనన్న అన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనలో బీటీపీ కాలువలకు భూములిచ్చిన రైతులకు రూ.204కోట్లు ప్రకటించిన సీఎం పక్షం రోజుల్లోనే నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పరిహారం పంపిణీ ప్రక్రియ పూర్తికాగానే బీటీపీ కాలువ తవ్వకాలు చేపడతామన్నారు. నారా లోకేష్, పవన్‌కళ్యాణ్ మతి భ్రమించి ఎలాంటి అజెండా లేకుండా రాష్ట్ర మంత్రులను, ఎమ్మెల్యేలను దుర్భాషలాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచులు హసీనాబీ, గోవిందమ్మ, మారుతేశ్వరీ, ఎంపీటీసీలు గంగమ్మ, కెంచమ్మ సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సచివాలయాల కన్వీనర్ రాము, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ వెంకటనాయుడు, డీఈ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానం లేదు... అది హత్యే!

- నాలుగు రోజుల క్రితం 'అనంత'లో ఘటన
- చిన్నపాటి ఆధారంతో కూపీ లాగుతున్న పోలీసులు
- రేపోమాపో వీడనున్న మిస్టరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాలుగు రోజుల క్రితం అనంతపురంలోని సున్నంగేరిలో ఓ యువకుడు మద్యం మత్తులో తలకు తీవ్ర గాయమై పడి ఉన్నాడు. గమనించిన అందరూ మద్యం మత్తులో తూలి కిందపడడంతో తలకు గాయమై ఉంటుందని భావించి, పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు ఆ యువకుడు మృతి చెందాడు. అయితే యువకుడి తలకైన గాయం ప్రమాదవశాత్తు తగిలింది కాదని పోలీసులకు అనుమానం వచ్చింది. ఇంకేముంది తీగ లాగారు... డొంక కదిలింది. యువకుడి మృతి సహజమైంది కాదని, అది హత్యగా నిర్ధారణ కావడంతో ఆ దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు.

ఏం జరిగింది?

అనంతపురంలోని చంద్రబాబు కాలనీలో నివాసముంటున్న ధనుంజయ అనే యువకుడు సెంట్రింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగు రోజుల క్రితం పనులు ముగించుకున్న ఆయన.. పాతూరులో ఫుల్‌గా మద్యం సేవించి ఇంటికెళుతూ.. సున్నంగేరిలో అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నట్లుగా భావించి వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని జీజీహెచ్‌కు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అయితే అప్పటికే ధనుంజయ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సాంకేతికత అందిపుచ్చుకుని

ధనుంజయ మృతిపై పోలీసులకు అనుమానాలు రేకెత్తాయి. దీంతో కేసు దర్యాప్తులో సాంకేతికతను అందిపుచ్చుకున్నారు. పాతూరు నుంచి సున్నంగేరికి వెళ్లే మార్గంలోని సీసీకెమెరాల పుటేజీలను పరిశీలించారు. అందులో సున్నంగేరిలోకి తూలుకుంటూ ప్రవేశించిన ధనుంజయ కనిపించాడు. అప్పటికే నడవలేని స్థితిలో ఉన్నాడు. అనంతరం ఎక్కడికి వెళ్లింది తెలియదు. తలకు ఎలా గాయమైంది? కూడా తెలియదు. అయితే పదునైన ఆయుధంతో దాడి చేయడం వల్లనే తలకు గాయమైనట్లుగా మాత్రం పోలీసులు గుర్తించారు. ఆయుధంతో దాడి చేసింది ఎవరు? అనేది మిస్టరీగానే ఉండిపోయింది.

నోటి దురుసుతోనే దాడి?

ధనుంజయ మృతి కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తులో తమదైన శైలిలో దూసుకెళ్లారు. ఇప్పటికే ధనుంజయ మృతిని హత్యగా నిర్ధారించుకుని ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. హంతకులు ధనుంజయ నివాసముంటున్న కాలనీకి సమీపంలో ఉంటున్న వారిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాగిన మైకంలో పరస్పర వాగ్వాదం చోటు చేసుకోవడంతో ధనుంజయ తలపై గుర్తు తెలియని ఆయుధంతో గాయపరిచి హంతకులు అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా తప్పుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో హంతకులను గుర్తించే పనిలో పడిన పోలీసులు ఇప్పటికే పక్కా ఆధారాలు సేకరించారు. నేడో... రేపో ఈ కేసులో మిస్టరీని ఛేదించి నిందితులను అరెస్ట్ చూపున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్



అనంతపురం సిటీ: నవరత్నాల అమలులో భాగంగా అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏయే పథకం కింద ఇప్పటి వరకూ ఎంత మంది లబ్ధిపొందారనే వివరాలను తెలిపారు. మొత్తం 19,252 మందికి వివిధ పథకాల కింద రూ.11.24 కోట్ల లబ్ధి చేకూరినట్లు వివరించారు.

దోపిడీ ముఠా ఆధారాల కోసం అన్వేషణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గార్లదిన్నె మండల పరిధిలో జాతీయ రహదారిపై రూ.2 కోట్లు దోపిడీ చేసిన ముఠా ఆచూకీ కోసం పోలీసుల అన్వేషణ కొనసాగుతోంది. 44వ జాతీయ రహదారి వెంబడి ఉన్న టోల్‌గేట్లలోని సీసీ కెమెరాల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దారి దోపిడీకి సంబంధించి బాధితులు తెలిపిన సమాచారం తప్ప ఇప్పటి వరకూ ఎలాంటి ఆధారం లభ్యం కాకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. కాగా, దారిదోపిడీ దారులు స్పష్టమైన తెలుగులోనే మాట్లాడినట్లు బాధితులు పోలీసులకు వివరించారు. దారిదోపిడీ జరిగిన తీరును పరిశీలిస్తే శ్రీధరన్ ముఠా పనిగా పలువురు భావిస్తున్నారు. వాహనాలకు నంబరు ప్లేట్లు మార్చడం. చోరీ సమయాల్లో సెల్‌ఫోన్లను వినియోగించక పోవడం. ముందుగానే పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగడం. రెక్కీ చేసి రూట్‌పై పట్టు సాధించడం లాంటి ప్రతి విషయంలోనూ దోపిడీ దారులు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, పెద్ద మొత్తంలో తీసుకెళుతున్న డబ్బు గురించి బాధితులకు ముగ్గురికి తప్ప ఇతరులెవరికీ తెలియదు. దీంతో వారిపై కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవరు శివతో పాటు మిగిలిన ఇద్దరి సెల్‌ఫోన్‌లోని కాల్ డిటైల్స్ సేకరించినట్లు తెలిసింది.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: ఓ చోరీ కేసులో తనను వేధిస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు..గోరంట్లకు చెందిన సురేష్.. రొద్దం మండలంలోని ఓ క్వారీలో పనిచేస్తుండగా చోరీ జరిగింది. అయితే చోరీ చేసింది సురేష్ అని యజమాని ఫిర్యాదు మేరకు రొద్దం పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు సంబంధం లేదని చెప్పినా విచారణ పేరుతో రొద్దం పోలీసులు వేధిస్తున్నారంటూ గురువారం ఉదయం గోరంట్ల పోలీస్ స్టేషన్ ఎదుట డీజిల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. సకాలంలో స్పందించిన పోలీసులు వెంటనే యువకుడి ప్రయత్నాన్ని విరమింపజేశారు. కాగా, ఘటనకు సంబంధించి యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

అధికారులూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- మంత్రి పెద్దిరెడ్డి పేరు ఉచ్చరించే అర్హత కూడా జేసీకి లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: బెదిరింపులు, దౌర్జన్యాలు జేసీ ప్రభాకరరెడ్డికి నిత్యకృత్యమని, ఈ విషయంగా అధికారులెవ్వరూ భయపడాల్సిన పని లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా విధులు నిజాయితీతో నిర్వహించాలని కోరారు. రెండు రోజుల క్రితం తాడిపత్రి పోలీసులు, మున్సిపల్ అధికారులను బెదిరిస్తూ ఓ ప్రెస్‌మీట్‌లో జేసీ ప్రభాకరరెడ్డి మాట్లాడిన తీరును ఆయన ఖండించారు. గురువారం గన్నేవారిపల్లి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరును కూడా ఉచ్చరించే అర్హత జేసీ ప్రభాకరరెడ్డికి లేదన్నారు. గౌరవప్రదమైన కుటుంబం నుంచి వచ్చి నిబద్ధతతో కూడిన రాజకీయ జీవితం గడుపుతున్న పెద్దిరెడ్డి కాలిగోటికి కూడా జేసీ ప్రభాకరరెడ్డి సరితూగడన్నారు. ఏ పోలీస్ అధికారికీ మంత్రి ఫోన్ చేసింది లేదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మర్యాదగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులకు పూర్తి స్వేచ్ఛను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. దీంతో నిజాయితీతో, పారదర్శక పాలన సాగిస్తున్న అధికారులను చూసి జేసీ ప్రభాకరరెడ్డికి పిచ్చి ముదిరిపోయిందన్నారు. బ్లాక్‌మెయిల్ చేయడం తప్ప మరేమీ తెలియని ఆయన ఎవరిని బడితే వారిని తంతాను, చీలుస్తానంటూ బెదిరింపులకు దిగుతున్నాడన్నారు. అధికారంలో ఉన్నన్నీ రోజులూ అన్ని దోచేసి, ఇప్పుడు తాము గొప్ప నీతిమంతులుగా ఫోజులిస్తే నమ్మేందుకు ప్రజలు పిచ్చివాళ్లేమీ కాదన్నారు. మూడు దశాబ్దాల క్రితం బస్సుల టైర్లను మార్చుకునేందుకు స్తోమత లేని జేసీ నేడు రూ.వేల కోట్లు ఎలా సంపాదించాడో ప్రజలకు బాగా తెలుసునన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాలనలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని, తాడిపత్రి ప్రాంతంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి, నాయకులు డీవీ కుమార్, రాంశేఖర్, గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

యూపీ డ్రైవర్‌కు టోకరా

- బాడుగ పేరుతో రూ.10 వేలు దండుకున్న మోసగాడు


లారీ డ్రైవర్ రైస్‌పాల్


డబ్బుతో ఉడాయించిన ఆగంతకుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: లారీకి బాడుగ ఉందంటూ నమ్మించి యూపీకి చెందిన ఓ డ్రైవర్‌ను మోసగించి రూ.10 వేలు దండుకున్న మోసగాడిపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ ప్రాంతానికి చెందిన రైస్‌పాల్... లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురానికి లోడు తీసుకువచ్చిన ఆయన అన్‌లోడింగ్ తర్వాత గురువారం ఉదయం బాడుగ కోసం లారీని బళ్లారి బైపాస్‌లో పెట్టుకుని ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో ఓ వ్యక్తి ఫోన్ చేసి కాన్పూరుకు కర్బూజా లోడు ఉందని, తాడిపత్రి రోడ్డులోని చెరువు కట్ట వద్ద ఉన్న కాటా వద్దకొస్తే తోటకెళ్లి లోడు చేయించుకుని వద్దామంటూ తెలిపాడు. దీంతో రైస్‌పాల్ లారీని తీసుకుని కాటా వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఓ యువకుడు కలసి లారీ డ్రైవర్‌తో మాటలు కలిపాడు. తోటలో కాయలు లోడు చేసేందుకు అవసరమైన అట్టబాక్సులు తీసుకోవాలని, గ్రామంలోకి వెళ్లగానే డబ్బు ఇచ్చేస్తాను ఓ రూ.50 వేలు ఉంటే ఇవ్వాలని నమ్మబలికాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని, యజమాని తన దారి ఖర్చుల కోసం ఇచ్చిన రూ.10 వేలు మాత్రమే ఉన్నాయని రైస్‌పాల్ తెలపడంతో ఆ డబ్బు తీసుకుని అట్టలు తీసుకువచ్చేంత వరకూ అక్కడే వేచి ఉండాలని తెలిపి వెళ్లిపోయాడు ఎంతసేపటికీ ఆగంతకుడు రాకపోవడంతో రైస్‌పాల్ ఫోన్ చేశాడు. స్పందన లేకపోవడంతో పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరకు జరిగిన విషయాన్ని అక్కడున్న వారికి తెలపడంతో ఆగంతకుడి సెల్‌ఫోన్‌కు వారు కాల్ చేయడంతో లిఫ్ట్ చేసి.. అతనెవరో తనకు తెలియదని బుకాయించి స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన రైస్‌పాల్ జరిగిన మోసంపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా మోసగాడిని గుర్తించి, గాలింపు చేపట్టారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు


పరుగుకు సిద్ధమైన ఎడ్ల బండి(ఇన్‌సెట్‌లో) పోటీలను చూసేందుకు వచ్చిన జనం

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు ఎగువవీధి చితంబరరెడ్డి జ్ఞాపకార్థం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద గురువారం నిర్వహించిన ఎద్దుల బండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, లిఖిత్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్కంఠగా సాగిన ఈ పోటీలను రౌండ్ల వారీగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై పోటీలు ప్రారంభించారు. కదిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరంతో పాటు కర్ణాటక నుంచి 68 బండ్లను రైతులు తీసుకొచ్చారు. రెండేసి బండ్లకు పోటీ నిర్వహిస్తూ మొత్తం ఆరు రౌండ్లలో విజేతలను ఎంపిక చేశారు. కర్ణాటక నుంచి విచ్చేసిన ఎద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి 8.30 గంటలకు పోటీలు ముగిసాయి. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు నిర్వాహకులు ఏవీ రమణారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. సమయాభావం కారణంగా చివరగా పోటీలో నిలిచిన రైతులు బుక్కపట్నం జంగం వెంకటేషు, కొత్తచెరువు రోషన్, జగరాజుపల్లి లయకిషోర్, కొత్తచెరువు రామాంజనేయులు, వెల్దుర్తి సతీష్, బూసేపల్లి నాగభూషణకు చెరో రూ.15 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించడం ద్వారా రైతులను ఉత్తేజ పరిచినట్లవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి

రాప్తాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి అన్నారు. గురువారం రాప్తాడు మండలంలోని చిన్మయనగర్‌లోని అంగన్‌వాడీ–1,2 కేంద్రాలను నోడల్ ఆఫీసర్ వనజాక్షితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం పంపిణీ చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల చిన్నారులకు పౌష్టికాహాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించొచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తడంతో సంపూర్ణ పోషక ఆహారాన్ని ఇంటికే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. 10 రకాల సరుకులను ప్రత్యేక సంచుల్లో నెలకు రెండు సార్లు ఇంటికే అందించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో 11 ప్రాజెక్టుల్లో 2,302 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. తాజాగా ఇళ్లకే కిట్లను పంపే ఉద్దేశంతో ప్రభుత్వం 15 కిలోల బ్యాగ్‌లో 10 రకాల సరుకులను నింపి సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27 నుంచి పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



ఆత్మకూరు పోలిమేర వద్ద నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయం

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఈ నెల 27 నుంచి పొలిమేర పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, గ్రామస్తులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 27న గంగపూజ, గోపూజ, గణపతి పూజ, నవగ్రహ రాధన, అంకురార్పణ, దీక్షాహోమం నిర్వహించనున్నారు. 28న ప్రాతఃకాలపూజ, దీక్షాహోమం, అదినాస హోమం, విగ్రహం ఊరేగింపు, మూల మంత్ర జపాలు, 108 రకాలతో అమ్మవారికి అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. 29న యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రతిష్ట హోమము, విగ్రహ అలంకరణలు, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మాజీ డిప్యూటీ మేయర్‌కు నివాళి



మాజీ డిప్యూటీ మేయర్ శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: మాజీ డిప్యూటీ మేయర్ బండి శ్రీరాములు (74) గురువారం ఆకస్మిక మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామి రెడ్డి కమలానగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మనోధైర్యం నింపారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఎర్రిస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ శశికళ

అనంతపురం రూరల్: పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ - క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ శశికళ తెలిపారు. గురువారం ఏ.నారాయణపురం రైతు భరోసా కేంద్రంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ శశికళ మాట్లాడుతూ పంట నష్ట పరిహారం, ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రతి రైతూ ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రసాద్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణకుమారి గురువారం తెలిపారు. మొత్తం రెండు విభాగాలకు గాను ఇంటర్వ్యూ నిర్వహించినట్లు తెలిపారు. జువాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ క్వాలిఫై అయిన విద్యార్థులు లేకపోతే ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ, కంప్యూటర్ అప్లికేషన్స్ పూర్తయిన వారు కూడా అర్హులన్నారు.

ఎస్కేయూలో సంతాప సభ



కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో తెలుగు విభాగం చెందిన విశ్రాంత ఆచార్యులు తుమ్మపూడి కోటేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈయన 1968లో ఎస్పీయూ పీజీ సెంటర్ అనంతపురంలో అధ్యాపకులుగా చేరారన్నారు. కోటేశ్వరరావు విభాగాధిపతిగానూ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ గానూ, ప్రిన్సిపాల్, డీన్‌గాను ఇలా అనేక పదవులు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎంపీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ కృష్ణకుమారి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కిటకిట

నగరం జనసంద్రమైంది. శుక్రవారం జరగనున్న వరలక్ష్మీవ్రతం పురస్కరించుకొని మార్కెట్‌లు కొనుగోలు దారులతో గురువారం కిటకిటలాడాయి. నగరవాసులేగాక గ్రామాల నుంచి వచ్చిన మహిళలు వరలక్ష్మీవ్రతం పూజా సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో పాతూరు, కొత్తూరు మార్కెట్లు పూలు, పూజాసామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. నగరంతోపాటు బుక్కరాయసముద్రం, నార్పల, అనంతపురం రూరల్ మండలాల నుంచి చుట్టుపక్కల గ్రామాల్లోనూ వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:





టెంకాయలు, పూలు,పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు









పూలహారాలు, పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ



రాప్తాడులో మానవహారం చేస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



మాట్లాడుతున్న ఇఫ్కో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: చంద్రయాన్-3 ల్యాండింగ్ విజయవంతం కావడంపై నగరంలో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్స్, ఉపాధ్యాయులు, ఏఓలు, పీఈటీలు, డాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.

• ప్రతిభా ఈ- స్మార్ట్ పాఠశాల విద్యార్థులు జయహో చంద్రయాన్-3 విజయోత్సవ నినాదాలతో ర్యాలీ చేశారు. ఆర్టీఓఆఫీస్ రోడ్డు మీదుగా. జేఎన్టీయూ, భైరవనగర్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వీరనారప్ప, కొండారెడ్డి, అంజన్ రెడ్డి, ప్రిన్సిపల్ వాసంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సభ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం తపోవనం ప్రభుత్వ పాఠశాలలో గురువారం 'ఇఫ్కో' సంస్థ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఫ్కో ప్రాజెక్ట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ పౌరులుగా గర్వించదగిన విజయాన్ని 'ఇస్రో' శాస్త్రవేత్తలు అందించారన్నారు. తపోవనం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించడానికి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఇఫ్కో రీజినల్ మేనేజర్ హుస్సేన్ వలి, జిల్లా మేనేజర్ రాంబాబు జిల్లా ప్రాజెక్టు రీసోర్స్‌పర్సన్ వన్నూర్‌స్వామి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాప్తాడులో ర్యాలీ

రాప్తాడు: మండల కేంద్రం రాప్తాడులో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 విజయవంతం కావడంలో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తూ గురువారం ర్యాలీ చేశారు. హెచ్ఎం నరసింహులు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యంకాని చంద్రుడి దక్షిణధ్రువానికి 'విక్రమ్'ను పంపించి శాస్త్రవేత్తలు సత్తా చాటారన్నారు. కార్యక్రమంలో పీడీ కేశవమూర్తి, ఉపాధ్యాయులు సాయిప్రసాద్, రామానుజులు, సాంబశివ, గోపాల్ రెడ్డి, శ్రీహరి, లక్ష్మన్న, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నరహరి తీర్థస్వామి ఆరాధన

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తిలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తండ్రి నరహరి తీర్థస్వామీజీ ఆరాధన, శివరూప దత్తాత్రేయ స్వామి జయంతి గురువారం వైభవంగా జరిగింది. ఈ ఆరాధన మహోత్సవాలను మైసూరు నుంచి వచ్చిన పురోహితుల ఆధ్వర్యంలో నరహరితీర్థ స్వామికి రుద్రహోమం, మహన్యాస పూర్వక ఏకదాశ రుద్రాభిషేకం, దత్రాత్రేయస్వామి తైలాభిషేకం, దత్తహోమం, స్వామికి ఆరాధన మహోత్సవం జరిపించారు. స్వామిజీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దానగుణం అలవర్చుకోవాలన్నారు. సుఖ, దుఃఖాలు మానవుడికి సామాన్యంగా వచ్చేవని, వాటిని సహనంతో ఎదుర్కొనేవారే జ్ఞానవంతులన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నుంచే కాక యితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో భక్తజన సందోహంతో ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం స్వామిజీ పూజలకు హాజరైన భక్తులకు రాగి ముద్దను తన చేతులతో ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది.



శ్రీనరహరి తీర్థస్వామికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

ప్రైవేట్ ఫైనాన్షియర్ల ఆగడాలు అరికట్టాలి

అనంతపురం టవర్ క్లాక్: ప్రైవేట్ ఫైనాన్షియర్ల ఆగడాలు అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. జేఏసీ నాయకులు సాకే హరి, అంకే తిప్పేస్వామి, రామకృష్ణ, నారాయణ స్వామి, రాజన్న, పసులూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు గద్దర్ సంస్మరణసభ

అనంతపురం కల్చరల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నారు. అనంత ప్రజా కళారుల బృందం శుక్రవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో గద్దర్‌కు నివాళులర్పించనున్నట్లు ప్రముఖ విప్లవ గాయకుడు దాసరి ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

పామిడి: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ నరసింగప్ప కోరారు. గురువారం సాయంత్రం ఆయన ఇన్‌చార్జ్ సీఐ షేక్ చాంద్‌బాషా, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి స్థానిక బీసీసీ రోడ్డుపై కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదన్నారు. అలా ఇస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆటోడ్రైవర్లు తప్పక యూనిఫామ్ ధరించాలన్నారు. ఏఎస్ఐ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం నాల్గో పట్టణ పోలీసుస్టేషన్‌కు ఓ మహిళ చేసిన ఫిర్యాదు విశాఖ దిశ పోలీసులు గురువారం బదిలీ చేశారు. వివరాలు.. విశాఖపట్నానికి చెందిన గంధం అనురాధ విశ్వేశ్వరి అనే యువతిని రుద్రంపేటకు చెందిన ముళ్లగూరి వెంకటనాయుడు అనే వ్యక్తికి ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. అప్పట్లో వధువు తరుపు నుంచి కట్నకానుకల కింద భారీగా నగదు, బంగారు ఇచ్చారు. కొంతకాలం అనురాధతో సన్నిహితంగా మెలిగిన వెంకటనాయుడు.. అనంతరం ఆమెను కట్నం కోసం వేధించసాగాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి.

వెంకటనాయుడు ఎంతకూ మారకపోగా అదనంగా రూ.10 లక్షలు కట్నం కావాలని వేధించసాగాడు. దీంతో అనురాధ తన బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. భర్త వైపు నుంచి కాపురానికి రావాలని ఎలాంటి పిలుపు లేకపోవడంతో ఆమె విశాఖ దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులకు ఈ కేసును బదిలీ చేశారు.

ఆటో బోల్తా..ఆరుగురికి గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువు తండా శివారులో గుత్తి-పత్తికొండ మార్గంపై గురువారం ఆటో అదుపు తప్పి బోల్తాపడి ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంకు చెందిన పుల్లమ్మ, శ్రీదేవి, భారతమ్మ, కోటేశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, దుర్గా ప్రసాద్ గుత్తిలో ఉంటూ కర్నూలు జిల్లా జొన్నగిరి చుట్టూ ఉన్న పల్లెల్లో ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గురువారం వేకువజామున గుత్తి నుంచి ఆటోలో జొన్నగిరికి వెళ్తుండగా చెరువు తండా గ్రామ శివారులో మలుపులో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి పంటపొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో పుల్లమ్మ, శ్రీదేవి తీవ్రంగా గాయపడ్డారు.భారతమ్మ, కోటేశ్వరమ్మ, వెంకటరత్నమ్మ, దుర్గా ప్రసాద్ స్వల్పంగా గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు పుల్లమ్మ, శ్రీదేవిని అనంతపురం తీసుకెళ్లారు. జొన్నగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయత్రి డెయిరీకి భూములు ఇవ్వం

• పనులు అడ్డుకున్న రైతులు, నాయకులు



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడు సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే (జాకీ కంపెనీకి కేటాయించిన భూమి పక్కనే) గాయత్రి ప్రైవేట్ మిల్క్ డెయిరీ ఏర్పాటుకు తమ భూములు ఇచ్చేది లేదని రాప్తాడు రైతులు పూజారి ఓబులయ్య, పూజారి పెద్దన్న, మాళ ఓబుళపతి, రామాంజనేయులు, నారాయణమ్మ, వెంకటరాముడు, మారెప్ప, నాగన్న, శేఖర్, ముత్యాలు తదితరులు తెలిపారు. రాప్తాడు పొలం సర్వే నంబర్ 274లో గత టీడీపీ ప్రభుత్వంలో 12.70 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించి, ఏపీఐఐసీకి అప్పగించారు. అప్పటి నుంచి ఆ భూమి ఏపీఐఐసీ పరిధిలోనే ఉంది. గాయత్రి మిల్క్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డెయిరీ ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కోరింది. దీంతో ఏపీఐఐసీ ..డెయిరీ ఏర్పాటుకు ఈ ఏడాది మే 2 వ తేదీన 7.90 ఎకరాల భూమి 33 ఏళ్ల లీజుతో కేటాయించింది. డెయిరీ యాజమాన్యం గురువారం భూముల్లోకి వచ్చి చదును చేస్తుండగా, రైతులు అడ్డుకున్నారు. దీంతో భారీ పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ వరప్రసాదరావు, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు అక్కడికి చేరుకుని ఈ భూమిని డెయిరీకి ఇచ్చినట్లు తెలిపారు. అయితే రైతులు తమ భూములను డెయిరీకి ఇవ్వడం కుదరదని వాగ్వాదానికి దిగారు. డెయిరీకి కాకుండా ఏదైనా పెద్ద పరిశ్రమకు భూములు కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. రైతులకు వైఎస్సార్ సీపీ, సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు మద్దతు పలికారు. రైతుల భూములను ఏపీఐఐసీకి అప్పగించి ఆరేళ్లు అవుతున్నా ఇంత వరకు నష్ట పరిహారం ఇవ్వలేదని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు చెరువుకు హంద్రీనీవా నుంచి నీరు వస్తుందని, తాము ప్రస్తుతం పంటలు సాగు చేసుకుంటామన్నారు. ఆర్డీఓ మధుసూదన్ మాట్లాడుతూ... అసైన్డ్ భూములు భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం సేకరించిందని, రైతులు ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇవ్వకపోవడం వల్లే నష్ట పరిహారం మంజూరు చేయలేదన్నారు. డాక్యుమెంట్స్ తెచ్చి ఇస్తే వెంటనే ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు. ధర్నాలో రైతులతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు మద్దిరెడ్డి నరేంద్ర రెడ్డి, పసుపుల ఆది, నారాయణ స్వామి, సాకే చంద్ర, చిట్రా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యులుగా గుర్తింపు తెచ్చుకోవాలి



బహుమతులు అందిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: విద్యార్థి దశ నుంచే నిర్దిష్టమైన లక్ష్యం ఏర్పరుచుకుని ఉత్తమ వైద్యులుగా గుర్తింపు తెచ్చుకోవాలని వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ గంభీర రఘునందన్ అన్నారు. గురువారం వైద్య కళాశాల వార్షికోత్సవంలో భాగంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రఘునందన్ వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే వైద్యులు, విద్యార్థులకు క్రీడా పోటీలు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, 2022, 2021వ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రజుమాలు అలంరించాయి.

పట్టు పంటతో అధిక ఆదాయం

ఆత్మకూరు: పట్టు సాగు చేసే రైతులు అధిక లాభాలను పొందొచ్చని జిల్లా పట్టు పరిశ్రమల అధికారి ఆంజనేయులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ముట్టాల గ్రామ రైతులకు పట్టు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టు ఏ విధంగా సాగు చేయాలి.. రైతులకు మెలకువలను తెలియజేశారు. డాక్టర్ వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పట్టు సాగు చేయడానికి షెడ్డుతో మొదలుకొని పంట అన్ని విధాలా సబ్సిడీలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ ఓబులేసు, టీఏ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మానకసిక రుగ్మతతో బాధపడుతున్న మౌనిక అనే యువతి అదృశ్యమైంది. బాధితురాలి తల్లి జయమ్మ అనంతపురం నాల్గో పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. 23న రాత్రి ఇంటి నుంచి యువతి వెళ్లిపోయింది. యువతి కోసం గాలిస్తున్నట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతాలు

అనంతపురం కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో అనంత, సత్యసాయి జిల్లాల్లో ఒక ఆలయం చొప్పున సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ సహాయకులు బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం సోమందేపల్లి మండల కేంద్రంలోని శివానగర్‌లోని శివాలయంలో, శింగనమల మండలం గుమ్మేపల్లిలోని సీతారామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాల తరఫున వరమాలక్ష్మీ వ్రతాలు జరుగుతాయన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయండి

అనంతపురం టౌన్: నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి చిన్నప్పయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రోజూ ఎడపెడా కోతలతో విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరాముడు, బండి రామకృష్ణ, ఓబిరెడ్డి, రమేష్, రవీంద్ర, వెంకటనారాయణ పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో కొలువైన వలీస్వామి ఆశ్రమంలో శుక్రవారం నుంచి కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్ తెలిపారు. 25న కలశస్థాపన, గణపతి హోమాలు, 26న జపాలు, వాస్తు హోమం, 27న ఉదయం 6 గంటలకు స్వామి అక్కల్ కోట మహారాజ్, కొల్హాపూర్ అమ్మవారు, ఆంజనేయ, నవగ్రహాల విగ్రహ ప్రతిష్టలు ఉంటాయన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



రమణయ్య



కుళ్లాయిస్వామి

రాప్తాడురూరల్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం అనంతపురం నగరంలోని వీకే మెమోరియల్ హాల్‌లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నిర్మాణ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎస్.రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈ కుళ్లాయి స్వామి, కోశాధికారిగా హనుమంతు రాయడు, ఉపాధ్యక్షుడిగా ఆనంద్, సాయిస్వరూప, వంశీ, నరసింహ యాదవ్, సహాయ కార్యదర్శులుగా ఆంజనేయులు, శ్రవణ్, కృష్ణ, వెంకట్ నాయక్, వీరితోపాటు 23 మంది కార్యవర్గ సభ్యులు, 45 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

ద్వితీయ భాషలు అమలు చేయాలి

రాప్తాడురూరల్: డిగ్రీలో ద్వితీయ భాషలను ఆరు సెమిస్టర్లలోనూ అమలు చేయాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద భాషల అధ్యాపకులు ఆందోళన చేశారు. తెలుగు భాష అధ్యాపకుడు డాక్టర్ నగరూరు రసూల్, సంస్కృతం అధ్యాపకులు కాశీ విశ్వేశ్వర్ శర్మ, డాక్టర్ ఎన్. ఓబిరెడ్డి మాట్లాడారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం భాషలను నాలుగు సెమిస్టర్ల నుంచి రెండు సెమిస్టర్లకు కుదించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు కుంటుపడుతుందన్నారు. ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవంలోపు డిగ్రీలో ద్వితీయ భాషలను ఆరు సెమిస్టర్లుగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఫిరోజా, రమాదేవి, అరుంధతి, ముత్యాలప్ప, పుణ్యవతి, శ్యాంసుందర్ శాస్త్రి, పతికి రమేష్ నారాయణ, రామకృష్ణ సూర్యనారాయణ రెడ్డి, రియాజుద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరాంపురంలో డబుల్ ఓట్లు



ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న ఓటరు కార్డులు

ఆత్మకూరు: మండలంలోని పి.సిద్ధరాంపురంలో డబుల్ ఓట్లు ఉండడంతో ప్రజలు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. తమ గ్రామం టీడీపీకి కంచుకోట అని చెప్పుకునే టీడీపీ నాయకులు ఇలా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు తయారు చేసుకొని మోసపూరిత రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శిస్తున్నారు. వివరాలు.. సిద్ధరాంపురం గ్రామంలో 1,2 బూత్‌లలో దాదాపు 1,350 మంది ఓటర్లు ఉన్నారు. వాటిలో ఏకంగా టీడీపీకి చెందిన వారికి 46 ఓట్లు రెండు చొప్పున ఓటుహక్కు కలిగిఉన్నట్లు బయటపడింది. ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓటు హక్కు కలిగి ఉంటే బీఎల్ఓలు, అధికారులు పరిశీలించి, తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. కానీ సిద్ధరాంపురంలో పలువురు టీడీపీ కార్యకర్తల ఓట్లు తొలగించడానికి అంగీకరించలేదన్న విమర్శలు ఉన్నాయి. వివాహం అయి కూడా ఇతర గ్రామాలకు వెళ్లినప్పటికీ వారి ఓట్లు మాత్రం సిద్ధరాంపురంలోనే ఉన్నాయి.

- సిద్ధరాంపురానికి చెందిన రాజేశ్వరి అనే మహిళకు ఓటుహక్కు సిద్ధరాంపురంతోపాటు అనంతపురంలోని అరవింద్ నగర్‌లోనూ ఉంది.
- గోవర్ధన్ అనే వ్యక్తి ఓటు హక్కు సిద్ధరాంపురంతో పాటు అనంతపురంలోని రాంనగర్‌లో ఉన్నట్లు గుర్తించారు.
- విజయలక్ష్మి అనే మహిళలకు సిద్ధరాంపురం గ్రామంతో పాటు అనంతపురంలోని పాపంపేట బ్లాక్ 4,5 లో కూడా ఓటు ఉంది.
- నరేంద్రచౌదరి అనే వ్యక్తికి సిద్ధరాంపురం గ్రామంతో పాటు అనంతపురంలోని పాపంపేటలో ఓటు హక్కు ఉన్నట్లు బయటపడింది. ఇలా దాదాపు 46 వరకు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు అంటున్నారు.

తహసీల్దార్ ఏమన్నారంటే.. : దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే పరిశీలించి, ఒక చోట తొలగిస్తామన్నారు. అలా ఎవరైనా బీఎల్ఓలకు సహకరించకపోతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



తెలుగు సినిమా...

ఎత్తర జెండా

సినిమా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్ఆర్ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్ఆర్ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్ఆర్ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధం ధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.


● విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)


● ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)


● కృతీసనన్ (మిమీ)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. **- చిరంజీవి**

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్ఆర్ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
- రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. **- కీరవాణి**

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. **- ఆలియా భట్.**

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. **- అల్లు అరవింద్**

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ సిక్సర్


● కీరవాణి ● శ్రీనివాస్ మోహనన్ ● కాలభైరవ ● ప్రేమ్ రక్షిత్ ● కింగ్ సాల్మన్


● దేవిశ్రీ ప్రసాద్ ● చంద్రబోస్ ● బుచ్చిబాబు ● పురుషోత్తమాచార్యులు


● కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
- వై. రవిశంకర్, నిర్మాత

ఇదొక చరిత్ర

- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
- నవీన్ యెర్నేని, నిర్మాత

''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.
- బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) - కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం):
ఆర్ఆర్ఆర్ - ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్ఆర్ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ
(ఆర్ఆర్ఆర్ - కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ):
ఆర్ఆర్ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్ఆర్ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా
(గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్:
శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ -
మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ
(గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్):
అరుణ్ అశోక్ - సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ,
ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్
(నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా -
ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్
(సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో - గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్‌జర్వేషన్:
అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్-ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్
హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్ఆర్ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్):
అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్):
సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్:
మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్థన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్:
ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీసింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)


ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతిశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.



'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను - ఎంఎం శ్రీలేఖ

''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడే వారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ



- ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.